అరకొర వసతులు.. అందని వైద్యం

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమస్యల తిష్ట
- వైద్యులు, సిబ్బంది కొరతతో అందని వైద్య సేవలు
- రేబిస్ టీకాలు అందుబాటులో లేని వైనం
- ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న రోగులు



శిథిలావస్థలో మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రి భవనం

మహేశ్వరం: మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు కనీస వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహేశ్వరం మండల కేంద్రంలో 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి (కమ్యూనిటీ హెల్త్ కేంద్రం), దుబ్బచర్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రెండు ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయి. మహేశ్వరం, దుబ్బచర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల, సిబ్బంది కొరతతో రోగులకు సమయానికి వైద్యసేవలు అందడంలేదు. మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రి శిథిలావస్థకు చేరి వర్షం వస్తే పైకప్పు నుంచి నీరు కారుతోంది. దీనికి తోడు ఆస్పత్రి భవనం చిన్నదిగా ఉండటంతో రోగులు విశ్రాంతి తీసుకోవడానికి సరపడా జాగా ఉండటం లేదు. మహేశ్వరం ఆస్పత్రిలో 16మంది వైద్యులు పనిచేయాల్సి ఉండగా కేవలం ఐదుగురే పనిచేస్తున్నారు. అందులో ఇద్దరు వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి నుంచి డిప్యూటేషన్‌లో పనిచేస్తున్నారు. నర్సులు, ఏఎన్‌ఎంలు కూడా సరిపడాలేరు. ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయం కలిగితే జనరేటర్ లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు ఆస్పత్రికి ఓపీ 150 నుంచి 200 మంది వరకు వస్తుంటారు. గర్భిణులు వారంలో రెండు రోజుల పాటు సోమ–శుక్రవారంలో 50 నుంచి 60 మంది వైద్య పరీక్షలు చేయించుకుంటారు. ఆస్పత్రిలో కుక్క కాటు, పాము కాటుతో పాటు జ్వరం, బీపీ, షుగర్, దగ్గు, జలుబు, కడుపునొప్పి జ్వరానికి మందులు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. రక్త, మూత్ర, మలేరియా, టైఫాయిడ్‌తో పాటు పలు పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోగులకు ఎక్సరే కూడా తీస్తున్నారు. పాత ఆస్పత్రి పక్కన సుమారు రూ.4కోట్ల నిధులతో 30 పడకల ఆస్పత్రి నూతన భవనాన్ని నిర్మాణం చేసి ప్రారంభించకుండా వదిలేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి నూతన ఆస్పత్రిని ప్రారంభించి రోగులకు వైద్యసేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

దుబ్బచర్లలో ఖాళీగా డాక్టర్ పోస్టు..

మండల పరిధిలోని దుబ్బచర్ల ఆస్పత్రిలో డాక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. డాక్టర్ లేకపోవడంతో రోగులు వైద్య పరీక్షలు చేసుకోవడానికి ఆసక్తి కనబర్చడం లేదు. ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఉన్నా డిప్యూటేషన్‌పైన కందుకూరు ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నారు. ఆస్పత్రిలో నాసిరకమైన మెటీరియల్‌తో నిర్మాణం చేయడంతో తలుపులు, కిటికీలు, బెంచీలు, కుర్చీలు ఇరిగిపోయాయి.

ఉన్నవారిపైనే భారం..

మీర్‌పేట: నియోజకవర్గంలోని బాలాపూర్ యూపీహెచ్‌సీ పరిధిలో అత్యధికంగా 2లక్షలకు పైగా జనాభా ఉన్నారు. ప్రతిరోజు ఆస్పత్రికి ఇన్‌పేషెంట్‌లు దాదాపు 200 మంది వస్తుండగా, ఔట్‌పేషెంట్‌కు సంబంధించి 7 నుంచి 10 మంది ఉంటారు. దగ్గు, సాధారణ జ్వరంతోనే ఎక్కువగా రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. ఎక్కువ జనాభా, తక్కువ సిబ్బంది ఉండటంతో ఉన్న వారిపైనే అధిక పని భారం పడుతోంది. ప్రస్తుతం 35 మంది ఫీల్డ్ స్టాఫ్ ఉన్నారని, మరో 20 మంది అవసరం ఉందని వైద్య సిబ్బంది తెలిపారు. అదనంగా 5గురు ఏఎన్‌ఎంలు, ఇద్దరు వైద్యులను నియమిస్తామని ప్రభుత్వం ఇదివరకే ప్రకటించిందని, త్వరగా నియమిస్తే ప్రజలకు వైద్య సేవలు మరింత వేగంగా అందించే అవకాశం ఉంటుందని తెలిపారు.

పాము కాటుకు మందులే లేవు..

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్ నాదర్‌గుల్‌లోని పల్లె దావాఖానా, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో సీజనల్ వ్యాధులకు మందుబిళ్లలు అందుబాటులో ఉన్నప్పటికీ పాముకాటుకు వాడే అంటీవీనమ్ మందులు అందుబాటులో లేవు. తేలు, కుక్క కరిచినా మందులు అందుబాటులో లేవు. అలాగే ల్యాబ్ టెక్నీషియన్ ఎవరూ అందుబాటులో లేరు. అలాగే నాదర్‌గుల్‌లోని పల్లె దవాఖానాలో వైద్యురాలు గాయత్రి అందుబాటులో ఉండి అవుట్ పేషంట్లకు వైద్యం చేసి మందులు అందజేస్తున్నారు. సీజనల్ రోగులకు మందులు అందుబాటులో ఉన్నాయి. ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు అందుబాటులో ఉన్నారు.

200 మందికి ఒక్కరే వైద్యులు..

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం అవుట్ పేషెంట్ విభాగానికి రోజుకు సగటున 150 నుంచి 200 మంది రోగులు వస్తుంటారు. వీరిలో నెలలు నిండిన గర్భిణిలతో పాటు కుక్కకాటు బాధితులు, డెంగీ, దగ్గు, జ్వర పీడితులు ఉంటారు. రోగుల నిష్పత్తికి తగినంత మంది వైద్యులు లేకపోవడంతో ఉన్న ఒక్క వైద్యురాలిపై ఒత్తిడి తప్పడం లేదు. సాధారణ చికిత్సలు మొదలు కాన్పుల వరకు అన్ని సదరు వైద్యురాలే చూసుకోవాల్సి వస్తోంది. ఫలితంగా రోగులకు సకాలంలో వైద్య సేవలు అందకుండా పోతున్నాయి. సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో రోగం మరింత ముదిరి వారి ప్రాణాలమీదకొస్తోంది. అంతేకాదు ఆస్పత్రి పరిధిలో 12 బస్తీ దవాఖానాలు ఉండగా, మరో ఐదు అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో ముగ్గురు వైద్యులు మాత్రమే ఉన్నారు. మిగిలిన వాటిలో లేకపోవడంతో స్టాఫ్‌నర్సులే వైద్యులుగా అవతారం ఎత్తాల్సి వస్తుంది. కుక్కకాటు, పాము కాటు బాధితులకు ఇబ్బందులు తప్పడం లేదు. అర్ధరాత్రి అత్యవసర పరిస్థితుల్లో ఉస్మానియా, గాంధీ, ఫీవర్ ఆస్పత్రులకు పరుగెత్తాల్సి వస్తోంది.

సిబ్బంది కొరత..

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలు, పీహెచ్‌సీలో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. కేవలం బీపీ, షుగర్, జలుబు లాంటి జబ్బులకు మాత్రమే పరీక్షలు చేసి మందులందిస్తున్న పరిస్థితి నెలకొంది. వాదే ముస్తఫా బస్తీలో నెలరోజుల క్రితం ప్రారంభించిన పీహెచ్‌సీలో ఒక డాక్టర్, ఒక నర్సింగ్ స్టాఫ్ మాత్రమే ఉన్నారు. మురికివాడగా ఉన్న ఈ ప్రాంతంలో పారిశుద్ధ్య సమస్యతో ప్రజలు విషజ్వరాలతో బాధ పడుతుంటారు. గతంలో ఈ ప్రాంతంలో డెంగీ మరణాలు సైతం సంభవించాయి. ప్రస్తుతం ఏర్పాటు చేసిన ఈ ఆస్పత్రి ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతోంది. జలుబు, కీళ్ల నొప్పులు, సీజనల్ వ్యాధుల లాంటి సమస్యలతో రోగులు ఎక్కువగా వస్తున్నారని డాక్టర్ ఆదిత్య తెలిపారు. రోజుకు 40–50 మంది రోగులు వస్తారన్నారు. ఈ ఆస్పత్రుల్లో పాము, కుక్క కాటుకు చికిత్సలు, యాంటీ రెబీస్ వ్యాక్సిన్‌లు కూడా అందుబాటులో లేవు.

సిబ్బందిని నియమించాలి

మా బస్తీలో ఏర్పాటు చేసిన పీహెచ్‌సీ సెంటర్ ఎంతో అనుకూలంగా ఉంది. ఒకప్పుడు లెనిన్‌నగర్‌కు వెళ్లాల్సి వస్తుండగా.. ప్రస్తుతం ఆ సమస్య తీరింది. డాక్టర్ పరీక్షలు చక్కగా నిర్వహించి మందులు అందజేస్తున్నారు. నా కూతురుకు జ్వరం ఉండగా పీహెచ్‌సీలో చూపించాను. త్వరగా మానింది. ఆస్పత్రిలో ఎక్స్‌రే మెషీన్లు ఏర్పాటు చేసి వైద్య సిబ్బందిని పెంచితే మరింత బాగుంటుంది. మెరుగైన సేవలు అందుతాయి.

– అక్బర్, వాదే ముస్తఫా బస్తీ, జల్‌పల్లి

58 రకాల పరీక్షలు చేస్తున్నాం

ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యసేవలు సకాలంలో అంస్తున్నాం. ముఖ్యంగా తెలంగాణ డయాగ్నోస్టిక్స్ సెంటర్ ద్వారా ప్రతిరోజు 58 రకాల పరీక్షలను నిర్వహించి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నాం. అదే విధంగా యూపీహెచ్‌సీలో అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఎక్కువగా కుక్కకాటు కేసులు నమోదు అవుతున్నందున యాంటీ రేబిస్ ఇంజక్షన్లు ఎప్పటికప్పుడు వేస్తున్నాం.

– బాలమణి, వైద్యాధికారి, బాలాపూర్ యూపీహెచ్‌సీ

సమస్యలు పరిష్కరించండి

మంత్రి సబితారెడ్డికి ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి



సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

మహేశ్వరం: కందుకూరు మండలంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు సోమవారం నగరంలోని మంత్రి సబితారెడ్డిని కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాల పెంపు, ఉద్యోగ భద్రత, హెల్త్‌కార్డులు ఇప్పించాలని మంత్రిని కోరారు. సీఎం కేసీఆర్ దృష్టికి ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను తీసుకెళ్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కందుకూరు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, టీఆర్ఎస్‌కేవీ మండల అధ్యక్షుడు నవీన్, బీఆర్ఎస్ నాయకులు రేవంత్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీనివాస్, శేఖర్, రవీందర్, రాములు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్తవేసిన ఐదుగురికి జరిమానా

మీర్‌పేట: బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై చెత్తను వేయరాదని మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ అల్లూరి వాణి విజ్ఞప్తి చేశారు. శానిటేషన్ అధికారులు, సిబ్బందితో కలిసి కమిషనర్ సోమవారం కాలనీల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్తను ఇళ్ల వద్దకు వచ్చే ఆటోలోనే వేయాలని కాలనీవాసులకు సూచించారు. అనంతరం జిల్లెలగూడ కల్లు కాంపౌండ్ పక్కన రహదారిపై చెత్త వేస్తున్న శ్రీశైలం, చందు, రాము, సంతోష్, శ్రీనుకు ఒక్కొక్కరికి రూ.200 చొప్పున జరిమానా విధించారు. కమిషనర్ వెంట ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, టౌన్‌ప్లానింగ్ వార్డు అధికారి నర్సింహ, పర్యావరణ ఇంజినీర్ రాము, శానిటరీ సూపర్‌వైజర్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ నర్సింహపురి కాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 11కేవీ సిరినగర్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

మహేశ్వరం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రఘుమారెడ్డి అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ నర్సింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకాగలరని కోరారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

బీజేపీ ఫ్లోర్ లీడర్ శివకుమార్



మొక్కలను పంపిణీ చేస్తున్న శివకుమార్

తుక్కుగూడ: నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాలని తుక్కుగూడ మున్సిపాలిటీ బీజేపీ ఫ్లోర్ లీడర్ శివకుమార్ సూచించారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల 4వ వార్డులో ఆయన మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటికి పండ్లు, పూల మొక్కలను పంపిణీచేశామని.. ఆయా మొక్కలను ఇంటి ఆవరణలో నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న శివకుమార్

పహాడీషరీఫ్: సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరంగా మారిందని మామిడిపల్లి కార్పొరేటర్ సుక్క శివకుమార్, బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నిమ్మల నరేందర్‌గౌడ్ అన్నారు. అనారోగ్యానికి గురై చికిత్స పొందిన మామిడిపల్లి గ్రామానికి చెందిన హరికిషన్‌కు రూ.60 వేలు, శ్రీకృష్ణకు రూ.22వేలు, నవీన్‌కు రూ.25వేలు, సందీప్‌గౌడ్‌కు రూ.25 వేలు, లక్ష్మీదేవమ్మకు రూ.32 వేలు మంత్రి సబితారెడ్డి సిఫార్సు మేరకు చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను వారు సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. బాలాజీ ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్, ఉదయ్, అఖిల్, కృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి, శ్యాం పాల్గొన్నారు.


‘సేవ’కు సన్మానం



రాజేష్‌కు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

దిల్‌సుఖ్‌నగర్: ప్రపంచ వీవర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ మంగళగిరిలో సోమవారం జరిగిన కాన్ఫరెన్స్‌లో వివిధ రంగాలలో సేవలు అందించిన ప్రముఖులను ఘనంగా సన్మానించారు. గత మూడు దశాబ్దాలుగా రెండు తెలుగు రాష్ట్రాల అనాథ, నిరుపేద విద్యార్థులకు ఉచిత భోజన, వసతి, విద్యా సౌకర్యాలు కల్పిస్తున్న కృషి అనాథ విద్యార్థి గృహం అధ్యక్షులు మార్గం రాజేష్‌ను ప్రపంచ వీవర్స్ ఆర్గనైజేషన్ ఫౌండర్ అంజన్ కర్నాటి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంజన్ కర్నాటి మాట్లాడుతూ.. రాజేష్ చేస్తున్న సేవలు అమోఘమన్నారు.

ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్‌కు సత్కారం



ఆమనగల్లు: ఎల్బీనగర్ ట్రాఫిక్ డీసీపీగా పదోన్నతి పొంది బాధ్యతలు చేపట్టిన ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన డీసీపీ శ్రీనివాస్‌ను ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో సోమవారం డీసీపీ శ్రీనివాస్‌నులయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్ కలిసి సత్కరించారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు రమేష్, సభ్యులు రాంచంద్రారెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులపై బెదిరింపులు సరికాదు

కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్



నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు

మహేశ్వరం: గత కొన్ని రోజులుగా తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బందిని అధికారులు, ప్రజా ప్రతినిధులు విధుల్లోకి చేరకపోతే తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడటం సరైంది కాదని జిల్లా కార్మిక సంఘం అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్ పేర్కొన్నారు. సోమవారం కందుకూరు మండల కేంద్రం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ, కార్మిక సంఘాల నాయకులతో గ్రామ పంచాయతీ కార్మికులు నిరసన తెలిపారు. సమస్యలను ఎంపీడీఓకు తెలియజేయడంతో ఆయన తన పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని, తన పరిధి కాని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ రాములు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కుమార్, సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు కుమార్, శేఖర్, మండల కారోబార్ సంఘం అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, కార్మికులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చూడండి

కార్పొరేటర్ శ్రీవాణి



డిప్యూటీ కమిషనర్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్

హుడాకాంప్లెక్స్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి డిప్యూటీ కమిషనర్‌ను కోరారు. సోమవారం నూతనంగా నియమితులైన సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అరుణను కలిసి ఆమె సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాలాల్లో పూడికలు పూర్తిగా తీయించాలని, తీసిన సిల్ట్‌ను చుట్టుపక్కల రోడ్లలోని చెత్త మట్టిలేకుండా శుభ్రం చేయించాలని కోరినట్లు తెలిపారు. జీబీ కాలనీ హనుమాన్‌గుడి నాలా గ్రావిటీ లెవెల్స్ సరిగ్గా లేనందున బయటికి పొంగి క్రాంతినగర్ కాలనీ కూడా దెబ్బతింటోందని, పైప్‌లైన్ మరమ్మతులు చేయించాలని, వేంకటేశ్వరకాలనీ రోడ్ నం.17 వద్ద నాలా నుంచి పూడికలు పూర్తిగా తీసి పైపులైన్ డయా పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



చిన్నతూప్ర జీపీ కార్యాలయాన్ని సందర్శించిన సభ్యులు

మహేశ్వరం: మండల పరిధిలోని చిన్నతూప్ర గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా థర్డ్ పార్టీ వెరిఫికేషన్ టీమ్ సభ్యులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు సోమవారం పర్యటించారు. పారిశుద్ధ్యానికి సంబంధించి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ కార్యాలయాలను సందర్శించారు. గ్రామంలో 20 కుటుంబాలకు సంబంధించి వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, నిర్వహిస్తున్న విధానం, తడిపొడి చెత్త వేరుచేసే విధానం వంటి పనులను పరిశీలించారు. పరిశుభ్రం, పచ్చదనం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ సెంట్రల్ టీమ్ సభ్యుడు లోకేష్, డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్, కందుకూరు డీఎల్‌పీఓ అమృత, ఎంపీడీఓ నర్సింహులు, చిన్నతూప్ర గ్రామ సర్పంచ్ రఘుపతిగౌడ్, ఉపసర్పంచ్ మమత, ఎంపీటీసీ అనితానాయక్, ఎంపీఓ రవీందర్‌రెడ్డి, ఎంపీఎం సత్యనారాయణ, టీఏ సుగుణ, పంచాయతీ కార్యదర్శి రాధ, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగాలను పర్మినెంట్ చేయండి

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి హోంగార్డుల వినతి



ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న హోంగార్డులు

ఇబ్రహీంపట్నం రూరల్: హోంగార్డులను పర్మినెంట్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని హోంగార్డులు కోరారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ మేరకు ఎమ్మెల్యేకు హోంగార్డులు వినతిపత్రం అందజేశారు . సీఎం కేసీఆర్ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కోరారు. కారుణ్య నియామకాలు చేపట్టలన్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హోంగార్డులు శ్రీశైలం ,మహేందర్, గణేష్, భాస్కర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సబితను బద్నాం చేసే కుట్ర

బడంగ్‌పేట దళిత నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న దళిత నాయకులు

బడంగ్‌పేట్: దళితుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న మంత్రి సబితారెడ్డిని బద్నాం చేసేందుకు బడంగ్‌పేటకు చెందిన కొంతమంది నాయకులు.. తమవర్గంలోని కొంతమంది దళితుల భూమి విషయంలో కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని బడంగ్‌పేటకు చెందిన దళితులు కొట్టి పారేశారు. సోమవారం బడంగ్‌పేటలో బడంగ్‌పేటకు చెందిన దళిత నాయకులు మాట్లాడుతూ.. బడంగ్‌పేటలోని దావత్‌ఖాన్‌గూడలో సర్వేనెంబర్–2లో దళితులకు 40.12 ఎకరాల భూమి గతంలో ఉండగా కొన్నేళ్లు సాగుచేసుకుంటూ వస్తున్నారు. కాలక్రమేనా 30 ఏళ్ల క్రితమే ప్రభుత్వం తీసేసుకుందని వారన్నారు. అప్పట్లో హోంమంత్రిగా ఉన్న సబితారెడ్డి అప్పుడు బడంగ్‌పేటకు చెందిన 9మంది దళిత కుటుంబాలను పిలిచి 5.30 ఎకరాల భూమిలో వారికోసం జాగాలు ఇచ్చింది. మిగిలిన 1.10 గుంటలను ప్రజాభవన్‌కు(ఉచిత ఫంక్షన్‌హాల్), 7 ఎకరాలను వెజ్ మార్కెట్‌కు, 1 ఎకరాను కెనరా బ్యాంక్‌కు, 5.30 హౌస్ సైట్‌కు, 3.23 ఎకరాలను పాలిటెక్నిక్ కాలేజీకి, 3.35 ఎకరాలు ఎన్‌క్రోజ్‌మెంట్‌లో పోగా, 26 గుంటలను లైబ్రెరీకి, 1.27 ఎకరాలను మున్సిపల్ కార్పొరేషన్ భవనానికి, 2 ఎకరాలను ప్రజా వైద్య భవనానికి, 1.5 ఎకరాలను నర్సరీకి, ప్రధాన రహదారిలో 3.6 ఎకరాలు పోయిందన్నారు. ప్రస్తుతం 1.30 ఎకరం మాత్రమే మిగిలిఉన్నదని వారు అన్నారు. ఇది కలెక్టర్, ఆర్డీఓ, స్థానిక తహసీల్దార్ తీసుకున్న నిర్ణయాలని అన్నారు. భూమిని కేటాయించిన వాటిలో ప్రస్తుతం భవన నిర్మాణాలు పూర్తి కావచ్చాయని తెలిపారు. మిగిలిన ఎకరంన్నర భూమిని మరోమారు దళితులకు ఇచ్చేందుకు మంత్రి ముందుకు వచ్చారని అన్నారు. అందుకు సంబంధించిన పేర్లను కూడా ఇచ్చామని పేర్కొన్నారు. కొందరు దళిత వ్యక్తులు కావాలనే ఇతర పార్టీల ముసుగులో మంత్రి సబితారెడ్డిని బద్నాం చేసేందుకు డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. డ్రామాలు ఆడుతున్న వ్యక్తులు కూడా గతంలో భూమి జాగాలు అందుకున్నారని ధ్వజమెత్తారు. ఇంకా 16 ఎకరాలు ఉందని మాయమాటలు చెప్పి పలు పార్టీల నాయకులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అదంతా పచ్చి అబద్ధమన్నారు. మంత్రి సబితారెడ్డి చలువతోనే దళితులు బాగుపడ్డారని పేర్కొన్నారు. సమావేశంలో కర్రె కృష్ణ, కర్రె బల్వంత్, పుట్టగళ్ల సంతోష్, సాయి, మహేష్, యాదగిరి, కృష్ణ, యాదయ్య, నర్సింగ్, రాములు, నర్సింహ తదితరులున్నారు.

ఆదిబట్ల సీఐగా రఘువీర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల పోలీస్ స్టేషన్ నూత న సీఐగా రఘువీర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నిన్నటివరకు ఆదిబట్ల సీఐగా పనిచేసిన రవికుమార్‌ను ఎస్‌ఓటీ–2కి బదిలీ చేస్తూ రాచకొండ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. సీసీఆర్‌బీలో పనిచేస్తున్న రఘువీర్‌రెడ్డి సోమవారం సాయంత్రం ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. అదే పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ లక్ష్మినారయణను పోలీస్ కంట్రోల్ రూంకు బదిలీ చేశారు. ఆదిబట్ల సీఐగా పనిచేసిన రవికుమార్ ఏడు నెలలకే బదిలీపై వెళ్లడం

రేపటి నుంచి పశువులకు టీకాలు

కడ్తాల్: పాడి పశువులకు బుధవారం నుంచి ఫుట్ అండ్ మౌత్ డిసీజ్ టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ భానునాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడి పశువుల్లో గడ్డలు కలిగిన జంతువులను ప్రభావితం చేసే వైరల్ అంటువ్యాధి ఫుట్ అండ్ మౌత్ డిసీజ్ అని తెలిపారు. జంతువుల్లో పొక్కువంటి గాయాలు, నాలుక చిగుళ్ల, నోటిలో, చనుమొనలపై ద్రవం నిండిన పొక్కులు కనిపిస్తే టీకాలు వేయించాలని సూచించారు. పశువుల్లో వైరస్ నివారణకు టీకాలు వేయించాలని సూచించారు.

బాధ్యతల స్వీకరణ

తుర్కయంజాల్: పురపాలక సంఘం నూతన టౌన్ ప్లానింగ్ అధికారిగా అలీపాషా సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన మేడ్చల్ జిల్లాలోని కొంపల్లితో పాటు తుర్కయంజాల్‌కు ఇన్‌చార్జి టౌన్‌ప్లానింగ్ అధికారిగా కొనసాగనున్నారు. సోమవారం, మంగళవారం, బుధవారం తుర్కయంజాల్‌లో అందుబాటులో ఉండనున్నారు. అలీపాషా గతంలో కూడా ఇక్కడ టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేసిన విషయం తెలిసిందే.

కార్యకర్తలకు అండగా ఉంటాం

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి



రాఘవేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

బడంగ్‌పేట్: కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం బీఆర్ఎస్ ఆర్‌కేపురం డివిజన్ సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎండీ.చోటు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి తన అనుచరులు, మిత్రులతో బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కష్టపడే ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గణేష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అనుకిరణ్, వినయ్, కృష్ణ, రాకేష్, సురేష్, రామ్, వెంకటేష్, సైలేష్, లక్ష్మణ్, రాజు, భాను తదితరులున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



ఆమనగల్లు: వైకుంఠధామాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం పల్లె దవాఖానాలను ఏర్పాటు చేస్తుందని ఆయన చెప్పారు. మాడ్గుల మండలం అవురుపల్లి గ్రామంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సోమవారం రూ.20 లక్షలతో నిర్మించే పల్లె దవాఖానా భవన నిర్మాణానికి శంకుస్థాపన, వైకుంఠధామం ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాలు, గిరిజన తండాలకు రోడ్ల నిర్మాణానికి పెద్దఎత్తున నిధులు మంజూరయ్యాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రావ్, లాలయ్యగౌడ్, రాంచంద్రయ్య, నిరంజన్‌గౌడ్, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, యాదయ్య, శ్రీనివాస్‌గౌడ్, పీఆర్ఎఈ సూర్యవంశీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ..

కడ్తాల్: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో గ్రామీణ ప్రాంత రోడ్లకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. కడ్తాల్ నుంచి వంపూగూడ, చల్లంపల్లి, సాలార్‌పూర్ గ్రామాల మీదుగా పడకల్ గేట్ వరకు ప్రస్తుతం ఉన్న సింగిల్‌రోడ్డును.. డబుల్‌రోడ్డుగా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రూ.18.90 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంతో కడ్తాల్, తలకొండపల్లి మండలాల ప్రజలకు రవాణ సౌకర్యం మెరుగుపడుతుందని అన్నారు. త్వరలోనే డబుల్‌రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు.